

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## అపశృతా ! బాధ్యతారాహిత్యమా?





**బిట్రగుంట, మార్చి 8 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారి రథం పడిపోవడంపై భక్తులు చాలా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణోత్సవం అనంతరం మంగళవారం సాయంత్రం కొండబిట్రగుంట నుండి బయలుదేరిన రథం రాత్రి పాతబిట్రగుంట నుండి కొండబిట్రగుంటకు తిరిగి వెళ్తున్న సమయంలో రథం చక్రాలు కాలువలో పడి అదుపుతప్పి క్రిందపడిపోవడం తెలిసిందే. ఈ ఘటనపై భక్తుల్లో పలు అనుమానాలు, భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. రథోత్సవంలో అపశృతి జరిగిందా, బాధ్యతారాహిత్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొండబిట్రగుంటలో 2021వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో అప్పటి పాత శ్రీవారి రథం అగ్నికి ఆహుతై దానిపై సమగ్ర దర్యాప్తు లేక ఆ సంఘటనను మరువక ముందే నూతనంగా 2022 సంవత్సరంలో తయారు చేసిన శ్రీవారి రథం మంగళవారం రాత్రి అదుపుతప్పి పూర్తిగా ఒరిగిపోయింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు లేకపోవడం, ప్రాణ నష్టం లేకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. పాతబిట్రగుంట నుండి పది నిమిషాలలో గమ్య స్థానానికి చేరే సమయంలో ఈ సంఘటన జరిగింది. దేవస్థానం పాలకమండలి, అధికారులు రథోత్సవం సమయంలో ఎలాంటి అపశృతులు జరగకుండా ముందస్తుగా రథం తిరిగే ప్రాంతంలో అడ్డంకులు తొలగించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని వినిపిస్తుంది. మరొక కారణం ఆచార సంప్రదాయాలకు బ్రహ్మోత్సవాలలో తిలోదకాలు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. రథోత్సవం సమయంలో రథానికి వున్న గుర్రాలపై ఓ వైసిపి నేత ఆచార సంప్రదాయాలకు విరుద్ధంగా కూర్చోవడం, రథోత్సవానికి ముందే రథం తిరిగే చోట ఓ వ్యక్తి గుండెపోటుతో మరణించడం ఇలాంటి వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలలో దేవుడు కన్నా వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తూ ఫ్లెక్సీలలో సైతం దేవుడి బొమ్మని కనపడకుండా చేశారనే ప్రచారం జోరుగా వుంది. దేవస్థాన చరిత్రలోనే ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు మూడు సంవత్సరాల లోపు రెండు చోటుచేసుకోవడం భక్తుల మనోభావాల్ని బాగా దెబ్బతీశాయి. దేవస్థానంలో ఆచార సంప్రదాయాలు కాపాడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**భద్రతా లోపం కాదు...మానవ తప్పిదమే : ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి**

కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం రాత్రి రథోత్సవంలో జరిగిన అపశృతి మానవతప్పిదమేనని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ సంఘటనపై మీడియాలో వస్తున్న కథనాలకు పత్రికా విలేకర్లకు ఆయన వివరణ ఇచ్చారు. రథం 50 అడుగులు వుందని పొడవు, వెడల్పు దృష్ట్యా రథం తిరిగే ప్రాంతంలో రహదారులు విస్తరణగా లేకపోవడమే ఈ ప్రమాదం మానవతప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో రథం తిరిగే ప్రాంతాలలో రహదారుల విస్తరణ, భూగర్భ డ్రైనేజి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించుకొని పనులు ప్రారంభిస్తామన్నారు. శ్రీ ప్రసన్నుడి కటాక్షం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని విగ్రహాలు కూడా దెబ్బతినలేదన్నారు.

## పోలేరమ్మ గుడి దగ్ధం



**బిట్రగుంట, మార్చి 8 ప్రభాతవార్త** బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు పంచాయతీలోని సోమేశ్వరపురం గ్రామంలో మంగళవారం రాత్రి పోలేరమ్మ గుడి దగ్ధమైంది. విద్యుత్ షాట్‌సర్క్యూట్ కారణంగా అమ్మవారి విగ్రహం తలభాగం, గుడి లోపల వున్న బీరువా, సామాగ్రి దగ్ధమైంది. అయితే ఈ దగ్ధం వెనుక షాట్‌సర్క్యూట్ కారణమని చెబుతున్నప్పటికీ పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భూపత్రాలు అందించిన కలెక్టర్



**పెంచలకోన(రాపూరు), మార్చి08ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి 200 ఎకరాల భూమిని అప్పగిస్తూ ఇందుకు సంబంధించిన 1 బి, అడంగల్ కాపిలను జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు, జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్‌లు బుధవారం ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డిలకు అందజేశారు. గత ఏడాదిలో కోనలో అభివృద్ధి పనులు ప్రారంబించేందుకు దేవస్థానం ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి ప్రయత్నించగా ఇందుకు అటవీశాఖాధికారులు అడ్డు చెప్పారు. కోనలో వున్న భూమి మొత్తం అటవీశాఖకు సంబందించినది అని ఇక్కడ ఎటువంటి పనులు చెపట్టరాదంటూ అడ్డుకున్నారు. దీంతో ఆలయ ఛైర్మన్ స్వామి వారి భూములకు సంబందించిన రికార్డులను వేతికి పట్టుకున్నారు. అనంతరం అనేక పర్యాయాలు జిల్లా కలెక్టర్ దృషికి విషయాన్ని తీసుకువెల్లి స్వామి వారి భూములకు సంబందించి రెవెన్యూ, అటవీ అధికారులచే జాయింట్ సర్వే చెయించారు. ఈసందర్భంగా స్వామి వారి భూములకు సంబందించిన రికార్డులను అటవీశాఖాధికారులకు ఆయన ఆందజేశారు. ఆ రికార్డులు పరిశీలించిన అటవీ శాఖ అధికారులు అప్పటి మద్రాసు ప్రభుత్వం 1891లో స్వామి వారికి 200 ఎకారలు కేటాయిస్తూ జిఓ ఇచ్చిన విషయం గుర్తించారు. ఈ మేరకు ఈ భూములను స్వామి వారికి ఇచ్చేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఈ భూమలకు సంబందించి రెవెన్యూ రికార్డులలో చేర్చి ఇందు సంబందించి ఖాతా నెం.957 ద్వారా సర్వే నెం. 86లో 1 లో 143 ఎకరాలు, 87లో 1లో 57 ఎకరాలకు సంబందించిన 1బి, అడంగళ్‌ను ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డిలకు జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్, రాపూరు మండల తహశిల్దార్ సుభాషిణీలతో కలసి ఆందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్ ఆశోక్, ఆలయ ప్రదానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి తదితరులున్నారు.

**కలెక్టర్, డిఎఫ్‌ఓలకు ఆలయ ఛైర్మన్ ధన్యవాదాలు**

గత ఎన్నో సంవత్సరాలుగా దేవస్థానంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయాలన్నా అటవీ శాఖ భూమి అన్న కారణంగా ఇబ్బందులు పడేవారమని, అయితే జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్, చక్రధర్ బాబు, జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ భూములకు జాయింట్ సర్వే చేయించి స్వామి వారికి ఇందుకు సంబందించి అధికారికంగా రికార్డులను ఆందజేసిన కలెక్టర్, డిఎఫ్‌ఓలకు ఆయన ఆలయ పాలకమండలి, స్వామి వారి భక్తుల తరపున ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

## కార్మికులు తగిన భద్రతతో వ్యవహరించాలి

**ముత్తుకూరు, మార్చి8, ప్రభాతవార్త** ఆదానీ కృష్ణపట్నం పోర్టులో బుధవారం భద్రతా వారోత్సవాలు జరిగాయి. పోర్టు సీఈఓ సంజయ్ కొత్త ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా వారోత్సవాల్లో మాత్రమే భద్రతగా ఉండటం కాదని, ఎల్లవేళలా కార్మికులు, ఉద్యోగులు జాగ్రత్తగా మెలగాలని సూచించారు.

ఆదాని సంస్థ పోర్టులో కార్మికులు, ఉద్యోగులకు తగిన భద్రత ఏర్పాటు చేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5కిలో మీటర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, భద్రతా అధికారి రామకృష్ణ, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు హాజరైయ్యారు.

## వైభవంగా చక్రస్నానం



**బిట్రగుంట, మార్చి 8 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు అనంతరం చక్రస్నానాన్ని నిర్వహించారు. కోనేటిలో ఈ కార్యక్రమం కనులపండుగగా జరిగింది.

## ఈదురువారిపాలెంలో మంత్రికి ఘనస్వాగతం



**ముత్తుకూరు, మార్చి8, ప్రభాతవార్త** ముత్తుకూరు మండలంలోని బ్రహదేవంపంచాయతీలోని ఈదురువారిపాలెంలో వ్యవసాయశాఖమంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం వైపే వైసిపి పని చేస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మా ్యనిఫెస్టోలో ఇచ్చిన వాగ్ధానాలను 98.5శాతం నెరవేర్చారని ఆయన అన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ధిక లోటు ఉన్నప్పటికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంపై బురదచల్లేందుకు టిడిపి నాయకులు ఎన్ని కుట్రల్లు పన్నినా ప్రజలు గమనించి వైసిపిని ఆదరిస్తారన్నారు. ఆంధ్రరాష్ట్ర శాశ్వత ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని ఆయన అన్నారు. ఈకార్య క్రమంలో మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, స్ధానిక నాయకులు జడ్పిటిసి వెంకట రమణయ్య, కోఆప్షన్ సభ్యులు జమీల్, దేవస్ధానం ఛైర్మన్ కట్టా సుబ్రహ్మణ్యం, దామవరపు శ్రీధర్‌రెడ్డి, సాయిరెడ్డి, జట్టి శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్, అగ్ని, వెంకటేశ్వర్లు, మామిడాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**నెల్లూరు క్రైమ్, మార్చి8, ప్రభాతవార్త** నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ విజయరావు మహిళా పోలీసులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు లేనిదే సమాజ భవిష్యత్తు లేదని పేర్కొన్నారు. అలాగే మానవమనుగడ లేదన్నారు. ఈ సందర్భంగా ప్రముఖన్యూరాలజిస్ట్ డాక ్టర్ బిందుమీనన్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. కా ్యన్సర్ నిరోదానికి పలు అంశాలు, జాగ్రత్తలను మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలోఏఎస్పీ హిమవతి, ట్రాఫిక్ సిఐ నాగేశ్వరమ్మ, రూరల్ ఎస్సై స్వప్న, పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## బస్సు ఢీకొని వాహనదారుడికి గాయం

**నెల్లూరు క్రైమ్, మార్చి8, ప్రభాతవార్త** ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వద్ద బుధవారం ఆర్టీసి బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైయ్యాయి. ట్రాఫిక్ పోలీసులవివరాల ప్రకారం పోలీస్‌శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఒకరు ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తంవెళ్తున్నారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి.

## మహిళా దినోత్సవ ర్యాలీ



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి8, ప్రభాతవార్త** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్ధానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కమీషనర్ హరిత ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. ఇందులో భాగంగా జిల్లా క్రీడాకారుల సంస్థ, నగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు, ఎన్‌సిసి, వాకర్స్, మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధికారులు, సిబ్బంది వ్యాయామ ఉపాధ్యాయులు, స్పోర్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ హరిత మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జరుగు క్రీడా పోటీల్లో మహిళలంతా పల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ పోటీల్లో పాల్గొని మహిళలు తమ చట్టా చాటాలని ఆకాంక్షించారు. ప్రతి మహిళకు కుటుంబసభ్యులు అండగా నిలవాలని కోరారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ర్యాలీలో డిఎంహెచ్ఓ పెంచలయ్య, సిఈఓ పుల్లయ్య, తదితరులు హాజరైయ్యారు.

## వైసిపి కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**నెల్లూరు(హరనాధపురం), మార్చి8, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు మెయిళ్ల గౌరీ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జిల్లా వైసిపి కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఉత్తర భారతదేశ టిటిడి స్ధానిక సలహా కమిటీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కేక్‌ను కట్‌చేసారు. ఈ సమావేశంలో ప్రశాంతి రెడ్డి, గౌరీలు మాట్లాడుతూ ఈ సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు స్వయంకృషితో రాణిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలే హోమ్‌మంత్రిగా ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ జయలక్ష్మి, ముస్లిం సంచారజాతుల రాష్ట్ర ఛైర్‌సర్పన్ ఆసీఫా, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మమతారెడ్డి, కార్పొరేట ర్లు విజయలక్ష్మి, దాసరి అమృత, సుజాత, జడ్పిటిసిలు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి8 , ప్రభాతవార్త** నగరంలోని పొదలకూరు రోడ్డులోఉన్న సూర్య స్కూల్ నందు మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నగర మేయర్ స్రవంతి జయవర్ధన్, కోఆప్షన్‌సభ్యులు షేక్.వహీదా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మహిళ వెన్నుముకలాంటివారని కొనియాడారు. ప్రపంచంలో మహిళలు ప్రస్తుతం టూవీలర్ నుండి విమాణాలు నిడిపే స్ధాయికి ఎదిగారని చెప్పారు. స్కూల్‌ఆవరణలో ఆటలపోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనలక్ష్మి, మనోరమ, నీలోఫర్, సమ్రీన్, చాందిని, మధు, షాహిన్, షమీమ్, తల్లిదండ్రులు హాజరైయ్యారు.

## అక్రమ కేసులు బనాయించడం దారుణం



**వెంకటాచలం మార్చి 8, ప్రభాతవార్త** అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం దారుణమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. వెంకటాచలంలోని టిడిపి కార్యలయంలో విలేకర్లు సమావేశము ఏర్పాటు చేసి మాట్లడారు.

జంగాలపల్లిలో జరిగిన గోడవను పోలీసులు దారుణముగా వ్యవహరించారన్నారు. బాదితులతో కలిసి వెంకటాచలం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఏవిదంగా కేసు నమోదు చేస్తారని పోలీసులను ప్రశ్నంచారు. రోజురోజుకు టిడిపి కార్యకర్తలపై దాడులు ఎక్కువ అవుతున్నాయని మండి పడ్డారు. కేసులకు బయపడే ప్రసక్తే లేదన్నారు ఓటమి బయంతో దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. కోడూరులో రోయ్యలు గుంటలు కట్టలు తెగ్గొట్టించి అటవీశాఖ అదికారి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అనంతరం వెంకటాచలంలో ఎమ్మెల్సి టిడిపి అభ్యర్ది కంచర్ల శ్రీకాంత్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి శ్రీకాంత్‌ను గెలిపించాలని కోరారు. అయన వెంట మండల టిడిపి అద్యక్షులు గుమ్మడి రాజాయాదవ్ టిపి గూడూరు టిడిపి నాయకులు బొమ్మిన సురేంద్ర మండలంలోని టిడిపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## పెంచలకోనలో చెట్టు నాటిన కలెక్టర్ దంపతులు



**పెంచలకోన(రావూరు), మార్చి08ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వి. చక్రధర్ బాబు, ఆయన సతీమణి, పిల్లలతో కలసి చెట్లను నాటారు. ముందుగా కోనకు చెరుకోన్న కలెక్టర్ దంపతులకు ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరంశ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆస్ధాన మండపంలో వేదపండితులు కలెక్టర్ దంపతులకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు ఆందజేసి, స్వామి వారి తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు. అనంతరం కోనలోని అటవీశాఖ ఉధ్యానవనంలో కలెక్టర్ దంపతులు జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ కోరిక మేరకు చెట్లను నాటారు. ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, రాపూరు రెంజ్ అటవీశాఖాధికారి రవీంధ్ర బాబు, తహశిల్దార్ సుభాషిణి, డిప్యూటీతహశిల్దార్ అశోక్, వైసిపి నాయకులువెంకటరమణా రెడ్డి వున్నారు.

## మహిళలే శక్తి స్వరూపిణులు



**కలువాయి మార్చి 8 ప్రభాతవార్త** :మహిళలే సృష్టికి మూలం అని,శక్తి స్వరూపిణులు అని సమాజంలో మహిళలకు అత్యధికమైన ప్రాధాన్యతను అన్ని రంగాలలో కల్పించాలని ఎపిఎం శ్యారాస్రవంతి పేర్కున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్దానిక వెలుగు కార్యాలయం నందు ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పలువురు మహిళల నుఈ సందర్బంగా సన్మానించి సత్కరించారు.ఈ సందర్బంగా ఎపిఎం స్రవంతి మాట్లాడుతు మండలంలో సంఘబంద మహిళలు రాష్ట్ర ప్రభుత్వం వారికి కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి ఎదుగుదలకు కృషి చేసుకోవాలని ఆమె తెలిపారు.ఈకార్యక్రమంలో సంఘబంధ అద్యక్షురాలు సిసిలు గోపాల్,వెంకటేశ్వర్లు,సాయిత్రి,మురళీ,ఇఒఎలు,కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరమ్మలు పాల్గొన్నారు.

## మహిళలను సన్మానించిన యుటిఎఫ్ మండల శాఖ



**మర్రిపాడు,మార్చి8ప్రభాతవార్త:** ఐద్వా ఆధ్వర్యంలో మర్రిపాడు యుటిఎఫ్ భవన్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . ఈసందర్బంగా మండల స్థాయిలో సమాజసేవలో ఉత్సాహంగా పాల్గొన్న మండల స్థాయి మహిళలను యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావ్, జిల్లా అధ్యక్షులు వి.చలపతిశర్మ పాల్గొని సందేశాలిచ్చారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి.వి.శేషులు, సీనియర్ రాష్ట్ర నాయకులు సి.హెచ్.శ్రీహరి , మండల సీనియర్ నాయకులు జిల్లా కార్యదర్శి హెచ్.మోహన్‌ప్రసాద్, ఎస్.కె.నాయబ్, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.ఖాజారసూల్, కె.సుధాకర్‌లు పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



**కందుకూరు,మార్చి8,ప్రభాతవార్త:**అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం టిడిపి పట్టణ కార్యాలయంలో నిర్వహించారు.ఇన్‌చార్జి ఇంటూరినాగేశ్వరరావు పార్టీ పరిశీలకులు చిట్టాబత్తిన చిట్టిబాబు,మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ముఖ్య అతిధులుగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా మహిళలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు.ఈ సమావేశంలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తెలుగు మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.పలువురు మహిళలు మాట్లాడుతూ 1983తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్రంలో మహిళలకు రాజకీయ,పారిశ్రామిక,వ్యక్తిగతంగా పలు చట్టాలను తెచ్చి మహిళలకు స్వేచ్ఛా స్వతంత్రం వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు దివి సౌభాగ్య,ఇన్‌చార్జి నాగేశ్వరరావుసతీమణి ఇంటూరి సౌజన్య,మహిళాప్రతినిధులు ముచ్చు లక్ష్మీరాజ్యం,కల్లూరి శైలజ,మన్నం శైలజ,బత్తెన ఆదెమ్మ, జొన్నలగడ్డ రమణమ్మ,గురజాల ఆంటోనమ్మ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గీతాంజలిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**కోవూరు, మార్చి 8 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల ఐసీసీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్ సీఎస్ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అనేక సవాళ్లు , సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలపై హింస, అత్యాచారాలు నానాటికి పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక చలనచిత్రాలు, కొన్ని సోషల్ మీడియా ఛానెళ్ల మహిళను వ్యాపార వస్తువుగా ప్రదర్శించడం దీనికి ముఖ్య కారణమన్నారు. నేటి యువతరం మథర్ థెరిసా సావిత్రిభాయి పూలే, ఇందిరాగాంధీ, కల్పనా చావ్లా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సుధామూర్తి వంటి విజేతలైన మహిళల నుంచి స్ఫూర్తిని పొందాలనానరు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు సృజనాత్మక ఆలోచనలతో, ప్రగతిశీల భావనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్, ఐసీసీ కన్వీనర్ డాక్టర్ విజయలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మిని శాలువాతో సత్కరించి సన్మానం చేశారు.

## మెడికవర్‌లో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్యాకేజీ

**నెల్లూరు మార్చి 8, ప్రభాతవార్త-వైద్యం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులు, మహిళా లెక్చరర్స్‌కి రూ.5వేలు విలువ గల ప్యాకేజీని కేవలం రూ.6 వందలకే అందించే గోడప్రతికను మహిళా డాక్టర్స్ చేతుల మీదుగా బుధవారం మెడికవర్ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ ఆసుపత్రి మహిళా సిబ్బందికి ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందని వారికి బహుమతులను అందచేశారు. అనంతరం కేకు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి టీచర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు రేడియాలజిస్ట్, డాక్టర్ ఆర్.ప్రియ రేడియేషన్ అంకాలజిస్ట్, డాక్టర్ నిషిత రేడియాలజిస్ట్, డాక్టర్ సాహిత్య ఎమర్జెన్సీ మెడిసిన్, డాక్టర్ శ్రీజ అనస్థీషియా, డాక్టర్ భావన అనస్థీషియా, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, మార్కెటింగ్ రీజనల్ హెడ్ ఉదయ్‌భాస్కర్, హెచ్‌ఆర్ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళాసాధికారతితతోనే అభివృద్ధి

**చేజర్ల,మార్చి8ప్రభాతవార్త:** మహిళా సాధికారితితతో చేజర్ల ఎంపిడిఒ ఎన్.విజయలలిత పేర్కొన్నారు .బుధవారం చేజర్ల వెలుగు కార్యాలయంలో ఎపిఎం సుజన ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ విజయలలిత మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలోను తీసిపోరన్నారు. మహిళలు విద్యాపరంగా అభివృద్ధి చెందితే సమాజం సాధారణంగా అభివృద్ధి దిశలోనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బాల్యవివాహాలు, గృహహింస, నిర్భయ లాంటిచట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ కుటుంబంలో అయితే మహిళ సాధికారిత సాధించి ఉంటుందో ఆ కుటుంబంలో లోటుపాట్లు లేకుండా ఉంటుందన్నారు. పొదుపు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎంపిడిఒ విజయలలితను, ఎపిఎంసుజనను పొదుపు మహిళలు శాలువాలు , పూలమాలలతో సత్కరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎపిఎం సుజన, విఒఎలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## మహిళే ఈ లోకానికి ఊపిరి ధార



**వింజమూరు,మార్చి8ప్రభాతవార్త:** మహిళే ఈ లోకానికి ఊపిరిధార అని రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ మాశిలామణి పేర్కొన్నారు .స్త్రీ ఒక శక్తి స్వరూపిణి, సృష్టికి మూలం , ఆది అంతానికి సందానకర్తగా ,కుటుంబానికి సారధిగా, బాంధవ్యాలకు వారధిగా మహిళ నిలుస్తుందన్నారు. బుధవారం మాశిలామణి హాస్పెటల్లో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని జరుపుకోవడం బాధ్యతగా భావించాలన్నారు. స్త్రీని గౌరవించిననాడే సృష్టి నిలబడుతుందన్నారు. ప్రేమకు ప్రతి రూపం, శ్రమ మారుపేరు , త్యాగానికి మరో రూపమైన మహిళ అనురాగాలకు ఆనవాళ్ళుగా ఆమె మనసు స్వచ్ఛమైన గంగాజలం వలె ఉంటుందన్నారు. ఈసందర్భంగా వివిధరంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తుచేస్తూ ప్రపంచ వ్యాప్తంగా మహిళాదినోత్సవాన్ని ఒక వేడుకగా నిర్వహిస్తుంటారన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంతోషంగా జీవించేందుకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉంటుందని ప్రకటించిందన్నారు. లింగబేధాలు, మహిళా హక్కుల గురించి కూడా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నేడు సాధారణ గృహిణి పాలకురాలిగా, విద్యావేత్తలుగా అనేక రంగాల్లో ముందుంటున్నారని మరింతమంది అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ప్రముఖ లాయర్ విజయభాస్కర్‌రెడ్డి సతీమణి గిరిజాకుమారిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మాశిలామణి సతీమణి నిర్మలాదేవి, కీర్తన, ప్రశాంత్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

వింజమూరు,మార్చి8ప్రభాతవార్త: వైఎస్ఆర్‌సిపి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల వైసిపి కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్‌లు కోరారు. బుధవారం పంచాయతీ పరిధిలోని బిసి కాలనీ , సుజాతనగర్ , జైభీంనగర్ కాలనీల్లో జోరుగా ప్రచారం సాగించారు. పట్టభద్రులను స్వయంగా వెళ్ళి కలసి పేరుపేరున పలుకరించి ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీర్వదించి పంపిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ల గెలుపుకు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నా మన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, సూరం వినోద్‌రెడ్డి, తాటిబత్తిన గురవారెడ్డి, సోషల్‌మీడియా ప్రతినిధులు అంకినపల్లి నర్సింహారెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి , పి.చెన్నయ్య, జి.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలి



**కావలి, మార్చి 8 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని కావలి రోటరీ క్లబ్ అధ్యక్షులు, రోహిణి ఆక్వా అధినేత వేలూరు జయచంద్రనాయుడు పిలుపునిచ్చారు. కావలి పట్టణ టివిఎస్ షోరూమ్ వద్ద బుధవారం రోటరీ క్లబ్, టివిఎస్ షోరూమ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు జయచంద్రనాయుడు మాట్లాడారు. రక్తం దొరకక ఏ ఒక్కరు మరణించకూడదన్నారు. ఎంతో మందికి సకాలంలో రక్తం అందక మృతి చెందుతున్నారన్నారు. అందుచేత యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు తరచుగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం కొరత లేకుండా పాటుపడాలన్నారు. గర్భిణీ స్త్రీలు, తలసేమియా రోగులు, పలు సర్జరీలు సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం చేసినందు వల్ల ఆ దాతకు మంచి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా రక్తదానం చేసి రక్త నిల్వల పెంపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీరాం విష్ణువర్దన్, గణేష్ మోటార్ అధినేత దినేష్, రోటరీ బాధ్యులు బచ్చు వీరాస్వామి, నల్లూరి రవికుమార్, వెంకటేశ్వరరెడ్డి, చెన్నా వెంకట్రామయ్య, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**రాపూరు,మార్చి08ప్రభాతవార్త:** రాపూరు మండల సమాఖ్యలో ఎపియం క్రిష్ణయ్య ఆధ్వర్యంలో బుదవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలనుఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎపియం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అబివృద్ధి చెందాలన్నారు. మహిళలఅభివృద్ధి ద్వారానే వారి కుటుంబంతో పాటు, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు సామాజికంగా రాజకీయంగా అబివృద్ధి చెందితేనే దేశం అబివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే మండల సమాఖ్యలక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపోందినమహిళలకు ఆయన బహుమతులు ఆందజశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య పధాధికారులు, గ్రామ సంఘాల ప్రతినిధులు,సి.సి.లు, వి.ఓ.ఏలు, సమాఖ్య అకౌంటెంట్, సంఘ సభ్యులు పాల్గోన్నారు.

## ఎపి మహిళాశక్తి ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలు



**రాపూరు,మార్చి08ప్రభాతవార్త:** మహిళా శక్తి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుదవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.సంస్థ ఆధ్యక్షురాలు తాటిబోయిన విజయమ్మ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కోంటున్న సమస్యలపై పోరాడేందుకే ఈ మహిళా శక్తి సంస్దనుస్థాపించడం జరిగిందన్నారు. మహిళలు ఈ రోజులలో అన్ని రంగాలలో ముందు వున్నారని తెలిపారు. మహిళలు అనేక వేలసంవత్సరాలుగా కన్యాశుల్కం, సతీ సహగమనం అనేక సామాజిక రుగ్మతలను అనేక పోరాటాలు చేసి వాటిని సమజం నుండిప్రారదోలారు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిఐ విజయకుమార్, క్యాన్సర్ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ, మార్పు సంస్ద వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్, ఉమ్మడి నెల్లూరు జిల్లా అట్రాసిటి సభ్యులు ఆదూరు రత్నం,న్యాయవాది అనుపమ తదితరులు వున్నారు.

## యాదవ్ భవన్ భూమి పూజకు యాదవులు తరలిరావాలి



**కావలి, మార్చి 8 ప్రభాతవార్త:** నెల్లూరులోని గొలగమూడి రోడ్డు కొండాయపాళెంలో ఈ నెల 12వ తేది నిర్వహిస్తున్న యాదవ భవన్ భూమి పూజకు యాదవ సోదరులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని యాదవ ప్రతినిధులు పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని మన్నెంగోపాలరెడ్డి కళ్యాణమండపంలో బుధవారం యాదవ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, రాయి రమణయ్య, మక్కే వెంకట సుబ్బయ్య, గద్దె వెంకటేశ్వర్లు, పెద్దగొల్ల సమాధి కృష్ణ, సన్నిబోయిన నారాయణ, కిషోర్, రమణయ్య తదితరులు పాల్గొని భూమి పూజ ఆహ్వానపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. నెల్లూరు జిల్లాలోని పేద, మధ్యతరగతి యాదవుల బహుళ ప్రయోజనాల అభివృద్దిని దృష్టిలో పెట్టుకొని యాదవ భవన్‌ను నిర్మించాలని తీర్మానించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈ నెల 12వ తేది భవన భూమి పూజను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంతోమంది యాదవులు ఈ జిల్లాలో ఆర్థికంగా వెనుకబడి వున్నారన్నారు. అనుకున్న లక్ష్యాల్ని సాధించలేక యాదవులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇబ్బందులు పడుతున్న యాదవుల్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి యాదవ ప్రముఖులు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్, నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలిబోయిన అనిల్‌కుమార్ యాదవ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, దూడల సుధాకర్, రూప్‌కుమార్ యాదవ్, పి.కృష్ణయ్య తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. యాదవ భవన భూమి పూజకు జిల్లాలోని యాదవ సోదరులందరూ తరలివచ్చి తమ సత్తాను ఐక్యమత్యాన్ని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

## వికలాంగులకు చెక్కు అందజేసిన కాకర్ల



**కలిగిరి, మార్చి08, ప్రభాతవార్త:**ఆపన్నులను ఆదుకోవడంలో మరొకసారి తన దాతృత్వాన్ని చాటుకుంటు కాకర్ల చారిటీబుల్‌ట్రస్ట్. కలిగిరి మండలంలోని క్రిష్ణారెడ్డిపాళెంలో బుదవారం శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామివారు ఆలయ ప్రారంబోత్సవం జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు కాకర్ల చారిటీబుల్ ట్రస్ట్ అదినేత కాకర్లసురేష్ స్వామివారిని దర్శించుకునేందుకు అక్కడకు చేరుకున్నారు. ఆగమ పండితులు సురేస్‌కు స్వామివారి ప్రసాదాలు అందజేసి దీవించారు.ఈసందర్బంగా సురేష్ తమ ట్రస్ట్ తరపున గుడి ప్రాగంలో అన్నదానికి రు. 25వేలరూపాయల చెక్కును గుడి పెద్దలకు అందజేశారు.అనంతరం అక్కడికి చేరుకున్న అంగవికలాంగులు ఉప్పులూరి రాంమూర్తి,ఉప్పులూరి జయరాం,చాగంటి చంద్రశేఖర్‌లకు ఒకొక్కరికీ రు. 20వేలరూపాయల వంతున మొత్తంరు.60వేలరూపాయల చెక్కులను అందజేసి ప్రజల మనస్సుల్ని దోచుకున్నారు.ఈ సందర్బంగా అక్కడకు చేరిన పెద్దలు మాట్లాడుతూ ఎంతోమంది ధనము సంపాదిస్తారని కానీ దానగుణంమాత్రం కొద్దిమందికి మాత్రమే ఉంటుందన్నారు. ఆ కొద్దిమందిలో కాకర్ల చారిటిబుల్ ట్రస్ట్‌అదినేత సురేస్ ఒకరన్నారు.ఇలాంటివ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని, ఇలాంటి ట్రస్టులు వల్ల సమాజానికి కొంత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో రావుల మనోజ,చాగంటి మాలకొండారెడ్డి,ఉప్పులూరు మాల్యాద్రిసుతారి మాల్యాద్రి, ఆలయ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వక్స్‌బోర్డు సభ్యులకు అభినందనలు



**నెల్లూరుటౌన్,మార్చి8,ప్రభాతవార్త:** వైయస్సార్‌సిపి మైనారిటి సెల్ జోనల్ ఇన్‌చార్జి సయ్యద్ హంజా హుస్సైని పలువురు అభినం దించారు. నెల్లూరు, తిరుపతి, కడపజిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా ఆయనను నియమించారు.ఈ సంద ర్భంగా బుధవారం ఆయన నివాసగృహంలో డిప్యూటి మేయర్ కలీల్,వక్స్ బోర్డు సభ్యులు షేక్.షఫీఉల్లా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌కు కూడా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కావలి పట్టణ జమియా మసీద్‌ముతవల్లి సయ్యద్ రషీద్,అబ్దుల్ అన్సర్ ఉన్నారు.

## మహిళల జీవితాలని నాశనం చేస్తున్న మద్యం పాలసీని వ్యతిరేఖించాలి



**నెల్లూరు,మార్చి32 ప్రభాతవార్త- విద్య:** రాష్ట్రంలో మహిళల జీవితాలతోపాటూ శ్రామికుల కష్టాన్ని దోచుకుంటూ వారి కుటుంబాలను నాశనం చేస్తున్న వైకాపా మద్యం పాలసీని మహిళలందరూ ఏకమై వ్యతిరేఖించాలని ప్రజా వైద్యులు డాక్టర్ బి.రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా పోరాట దినత్సోవాన్ని పురస్కరించుకుని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కమిటి ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక టౌన్‌హాల్ రీడింగ్ రూంలో సభను నిర్వహించారు. ఈ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాటా ్లడారు. సమాజంలో మహిళలు సగబాగంగా ఉన్నా వారిపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దాడులు ఆగటం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వటంలో కూడా మహిళలు చిన్నచూపుకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మహిలలకు 55శాతం రిజర్వేషన్లు ఇవ్వాలిని ఇందుకోసం పోరాటాలు సాగించాలన్నారు.

పార్లమెంట్‌లో 33శాతం రిజర్వేషన్లు అందని ద్రాక్షలాగనే మిగిలిపోయాయన్నారు. మద్యం అనేక కుటుంబాలను చిన్నాబిన్నం చేస్తుందని, దీనిని అరికట్టాల్సిన ప్రభుత్వం నాశిరకం మద్యాన్ని విక్రయిస్తూ పేదల జీవితాలను, వారి కష్టాన్ని దోచుకుంటుందన్నారు. సభాధ్యక్షురాలు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.కొండమ్మ మాట్లాడుతు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ మద్యపానం చేస్తామని హామీ ఇచ్చారని అధికారంలోని రాగానే నకిలీ, నాశిరకం మధ్యాన్ని ప్రజలకు అందించి వారి ఆరోగ్యాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పాలకులు సంక్షేమ పదకాలకు, మద్యం అమ్మకాలకు ముడిపెడుతు మాట్లాడుతున్నారని ఇది సరైన పద్దతి కాదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని, అంతేకాని ఇలా మద్యం విక్రయాలు చేయటం ద్వారా ఆదాయాన్ని ఆర్జించటం సిగ్గుచేటన్నారు.మహిళలు వారి హక్కులను పోరాటాల ద్వారానే సాదించుకోవాలన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేదాన్ని అమలు చేసేందుకు మహిళలు ఏకమై పోరాటాలు సాగించేందుకు సన్నదం కావాలని పిలపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యవర్గ సభ్యులు పి.జయమ్మ, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి సునీత, ఏఐటిఎఫ్‌యు న్యూ నాయకులు లక్ష్మీరెడ్డి, నాయుకులు శ్యామల, ఆర్.రత్నమ్మ, విజయ, రాజమ్మ, పిచ్చమ్మ, రిషిత, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.నగరంలో భారీ ర్యాలీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్య ంలో నగరంలోని స్థానిక విఆర్‌సి సెంటర్‌నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు అక్కడనుండి టౌన్‌హాల్‌వ వరకు సంఘ నాయకురాళ్లు భారీ ర్యాలీని నిర్వహించారు.

## వ్యవసాయకళాశాల విద్యార్థులతో అవగాహన



**సంగం మార్చి 9 ప్రభాతవార్త** సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆద్వర్యంలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి విద్యార్థుల చే రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో వేరుశనగ,లో వచ్చు పురుగులు,తెగుళ్ళు, పోషక విలువల లోపాలు,విత్తనశుద్ది పద్దతులు ఎలా చేయాలో రైతులకు వివరించారు. అలాగే పొలంలో పాటించే సమగ్ర సస్యరక్షణ పద్దతులను లింగాకర్షక బుట్టల ఆవశ్యకతను,జిగురు,ఎరలను వాడడం వలన వచ్చే ఉపయోగాలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం.వి ఓబయ్య, శాస్త్రవేత్త డాక్టర్ వి సురేఖాదేవి, గ్రామసర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, వాలింటర్లు పాల్గొన్నారు.

## వందశాతం స్లిప్పులు పంపిణి పూర్తి



**వరికుంటపాడు,మార్చి9,ప్రభాతవార్తః** ఎం.ఎల్.సి ఎన్నికలకు సంబందించి ఓటరుస్లిప్పులను వందశాతం పంపిణి చేశామని తహసిల్దార్ అబ్దుల్‌హమీద్ తెలిపారు గురువారం స్తానిక ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన పోలాంగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈసందర్బంగ ఆయన మాట్లాడుతు పట్టభద్రుల పోలింగ్‌కేంద్రం127లో 747మంది పట్టభద్రులు,ఉపాద్యాయ పోలింగ్‌కేంద్రం 60నందు 39మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.ఈకేంద్రాలలో సి.సి కెమేరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తామన్నారు.ఈకార్యక్రమంలో వి.ఆర్.ఓ శేషారెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖద్వారం ప్రారంబోత్సవం



**వరికుంటపాడు,మార్చి9,ప్రభాతవార్తః**మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్మించిన సీతారాములసమేత ముఖద్వారాన్ని స్తానిక వై.సి.పినేత గంగవరపు పుల్లయ్యనాయుడు గురువారం ప్రారంబించారు.వేద పండితులు విటపుకుమార్‌స్వామి ఆద్వర్యంలో వేదమంత్రోచ్చరణలమద్య ప్రత్యేకపూజలు నిర్వహించి ఘనంగాఆవిష్కరించారు.ముఖద్వారం నిర్మించిన రావెళ్ళ వెంకటరత్నంను గ్రామస్తులు అభినందించారు.

## తెలుగుదేశం అభ్యర్ధిని గెలిపించండి

**వరికుంటపాడు,మార్చి9,ప్రభాతవార్తః** పట్టభద్రుల ఎం.ఎల్.సి ఎన్నికలలో కంచర్ల శ్రీకాంతును గెలిపించాలని తెలుగుదేశంపార్టీ మండల కన్వీనర్ అన్నారు.రామదేవులపాడు,వరికుంటపాడు గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈకార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చంద్రా వెంకయ్య,మండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్,క్లస్టర్ ఇన్‌చార్జ్ పోకా మహేష్,టి.డి.పినేతలు మాధవ,రాధాకృష్ణ,శివరామయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు మహిళలు స్వయం ఉపాదిని మరింత పెంచుకోవాలి



**కోవూరు, మార్చి 9 ప్రభాతవార్త :** కోవూరు సం ఘమిత్ర ఏరియా పరిధిలోని 6 మండలాలకు సంబంధించి పొదుపు గ్రూపు మహిళలకు 5800 పెర టి కోళ్లను పంపిణీ చేయడం పూర్తయిందని కోవూ రు వెలుగు కోఆర్డి నేటర్ లలిత అన్నారు. కోవూ రులోని సంఘమిత్ర కార్యాలయంలో గురువార ఆమె మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా స్వయం ఉపాధిని పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. త్వరలో పొదుపు మహిళలకు గొర్రెలు, సూడి బర్రెలు పంపిణీ చేసేలా ప్రణాళికలు రూ పొందిచడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఒక్కో మండలానికి 50 గొర్రెలు ,చొప్పున పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోవూ రు మండలంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం పొదుపు గ్రూపులకు సంబంధించి బ్యాంకు రుణాల రికవరి సంతృప్తి కరంగా ఉందన్నారు. క్రమం తప్పకుండా తీసు కున్న రుణాలు బ్యాంకుకు చెల్లించే గ్రూపులకు మాత్రమే సున్నావడ్డీ అమలవుతుందన్నారు. వీవోఏలు కూడా పొదుపు గ్రూపు మహిళల్లో అవగాహన పెంచి ప్రతి గ్రూపులో సభ్యులంతా అక్షరాస్యులు ఉండాలనే ధ్యేయంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## కృత్రిమ గర్భధారణపై రైతులు అవగాహన చేసుకోవాలి



**కోవూరు, మార్చి 9 ప్రభాతవార్త :** పాడిరై తులు కృత్రిమ గర్భధారణపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని మేలుజాతి దూడల ఉత్పత్తికి సహకరించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉ న్న పశువైద్యశాలలో ఎదకు వచ్చిన ఆవుకు ఒంగోలు జాతి సెమన్ ద్వారా కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలుజాతి పశుసంపద ఉత్పత్తే ధ్యేయంగా ముందుకు సాగుతున్నా మన్నారు. అంతరించి పోతున్న మేలుజాతి పశు సంపదను పెంచడమే ప్రధాన లక్ష్యం అన్నారు. రైతులు కూడా ఈ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని కృత్రిమ గర్భధారణ ద్వారా వచ్చే ఉపయోగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రథం ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన మాలేపాటి



**కావలి, మార్చి 9 ప్రభాతవార్త** కొండబిట్రగుం ట ప్రసన్న వెంకటేశ్వరస్వామి రథోత్సవ ప్రమాదంలో గాయపడిన పోట్లూరి సుబ్రమణ్యంను టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు బిట్రగుంటలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చులకు నగదును అందజేశారు. సుబ్రమణ్యం వంటి మీద గాయాల్ని పరిశీలించారు. మాలేపాటి వెంట బోగోలు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్‌బాబు, జిల్లా యువత కార్యనిర్వాహక కార్యదర్శి రావి విజయ్‌కుమార్, కొర్సిపాటి బసిరెడ్డి, పాలకీర్తి శ్రీనివాసులు, రావి రంగయ్య, చల్లా ప్రసాద్, మద్దులూరు మనోహర్, వెంకట కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనావిష్కరణలకు గీతాంజలి శ్రీకారం



కోవూరు, మార్చి 9 ప్రభాతవార్త : కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆద్వర్యంలో శౌరశక్తితో పనిచేసే కాయిన్ బేసెడ్ మొబైల్ చార్జెర్‌ను ఆవిష్కరించడం జరిగిందని కళాశాల డైరెక్టరన డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ కేవలం ఒక రూపాయి నాణెం ఖర్చుతో మొబైల్ ఫోన్‌ను పూర్తిగా చార్జింగ్ చేయడం ఈ ఉపకరణం ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రధానంగా ఈ పరికరం శౌరశక్తితో పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ పరికరంద్వారా సామాజిక ప్రయోజనం కలుగుతుందన్నారు. కళాశాల కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. మెకానికల్ ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులతోపాటు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై.మురళీకృష్ణ,ఉన్నారు.

## నేటి నుంచి విద్యార్థులకు రాగిమాల్ట్ పంపిణీ



**కోవూరు, మార్చి 9 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న విద్యార్థులకు అదనంగా శుక్రవారం నుంచి రాగి జావను కూడా అందజేయాల్సి ఉంటుందని ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి జిల్లాలోని అన్ని మండలాలకు ఆదేశాలు కూడా వచ్చాయి. వారంలో ప్రతి మం గళ, గురు, శనివారాల్లో ఉదయం 8.45 గంటలకు ప్రతి విద్యార్థికి ఈ రాగి మాల్ట్ పంపిణీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి రాగి పిండి, బెల్లం చైకదుకాణాలకు పంపిణీ చేయడం జరిగిందని సంబంధిత ఎఫ్ఈ షాపుల ద్వారా ఏజెన్సీలు వీటిని తెచ్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో రాగి మాల్ట్ అదనంగా అందజేసేలా ప్రతి పాఠ శాల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ఆయా మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

## ఘనంగా అన్నదానం



**ఇనమడుగు(కోవూరు,) మార్చి 9 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కనకదుర్గా దేవి దేవస్థానంలో పరివార దేవతల జన్మదినోత్సవం సందర్భంగా రుత్వికులు శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో రుద్రహోమం, నాగదేవత హోమాలను సాంప్రదాయబద్ధంగా కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరిచారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కాకుటూరు రామ చంద్రారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కైకలూరుకు చెందిన టి. నరసింహారావు, పార్వతి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## బరువు తగ్గే ఆహారాలతో కిడ్నీలకు ప్రమాదం



**నెల్లూరు మార్చి 9, ప్రభాతవార్త-వైద్యం** బరువు తగ్గించే ఆహారాల వల్ల కిడ్నీలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని నారాయణ ఆసుపత్రి నెఫ్రాలజి విభాగాధిపతి డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ వ్యాధి దినోత్సవం సందర్భంగా నారాయణ ఆసుపత్రిలో డాక్టర్ బిసి.రాయ్ లెక్చర్ గ్యాలరీలో కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సులో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 90శాతం కిడ్నీ వ్యాధిగ్రస్తులు అవుతున్నారంటే అందుకు ప్రధాన కారణం వారి జీవనశైలేనన్నారు. ఇటీవల కాలంలో బరువు తగ్గేందుకు వారు తీసుకుంటున్న జంక్‌ఫుడ్, ప్యాకింగ్ ఫుడ్, తాగేనీరు కూడా కారణమౌతున్నాయన్నారు. కిడ్నీ వ్యాధి బారినపడకుండా ఉండాలంటే మంచి ఆహారాన్ని, స్వచ్ఛమైన నీరు తీసుకోవాలన్నారు. బరువు తగ్గేందుకు, శరీరాకృతిని మార్చుకునేందుకు కొన్ని రకాల బిళ్ళలు, రసాయన మిళితమైన పానీయాలు కూడా కిడ్నీలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. అలాంటి వాటి జోలికి వెళ్ళకుండా మంచి ఆహార పదార్థాలను తీసుకుంటే కిడ్నీ వ్యాధులు ధరిచేరవన్నారు. నారాయణ మెడికల్ సూపరింటెండెంట్ బి.హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కిడ్నీల ఆరోగ్యం కోసం మార్చి 9 నుంచి మార్చి 31 తేదీ వరకు సూపర్ స్పెషాలిటీ వైద్యులతో ఉచిత సలహాలు అందిస్తారని, వైద్యులు సూచించిన పరీక్షలపై 50శాతం రాయితీ ఇస్తున్నామని వెల్లడించారు. నారాయణలో దాదాపు 115కుపైగా కిడ్నీ మార్పిడిలు విజయవంతంగా చేసిన నారాయణేదనన్నారు. ఆ ఆసుపత్రి ఏజీఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రాయితీ సదావకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశాన్ని నెఫ్రాలజిస్ట్ ఎస్.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దొంగ సర్టిఫికేట్లతో వేల దొంగ ఓట్లు

**నెల్లూరు మార్చి 9, ప్రభాతవార్త-వైద్యం** దొంగ సర్టిఫికేట్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ నాయకులు వేల సంఖ్యలో దొంగ ఓట్లను చేర్చారని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మవరం.సుబ్బారావు ఆరోపించారు. గురువారం నగరంలోని 47, 48, 49 డివిజన్‌లలో టీడీపీ నేతలతో కలిసి సుబ్బారావు ఇంటింటికి తిరిగి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల.శ్రీకాంత్‌ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న ఎమ్మెల్సీ ఎలాగైనా గెలివాలనే ఆలోచనతో వైకాపా నాయకులు చేస్తున్న అక్రమాలకు అంతు లేకుండా పోతోందన్నారు. ఇళ్ళు లేని ప్రాంతాల్లో ఇంటి నంబర్లు వేయించి, వాటిపై దొంగ ఓట్లుని నమోదు చేయిస్తున్నారంటే ఇంతకంటే మరో దుర్మార్గం ఏముందన్నారు. చేతకాని దద్దమ్మలు మాత్రమే మోసాలకు పాల్పడుతారని విమర్శించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, త్వరలో టీడీపీ ఎన్నికల కమిషన్‌ని కలుస్తుందన్నారు. ఏది ఎమైనా నిరుద్యోగులు, పట్టభద్రులు, ఉద్యోగులు ఈసారి టీడీపీకి ఓట్లు వేసి విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్, సిద్ధకళాచారి, కేసి.భాస్కర్, ఎనికిపాటి.చెంగయ్య, మన్నారు.స్వామి, మునిశేఖర్, నానిరెడ్డి, కె.సుధా తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో బిజెపి అగ్రనేతలు పర్యటన

**బిట్రగుంట, మార్చి 9 ప్రభాతవార్త** బోగోలు మండలంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని బిజెపి జాతీయ కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డిలు పర్యటించారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, గుత్తి సుధాకర్, ప్రత్యూష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం వైసిపి ప్రచారం

**బిట్రగుంట, మార్చి 9 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో గురువారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నేతలు గందూరు శ్రీనివాసులు, ఎ.కె.సుందర్‌రాజ్, శేఖర్, షమీవుల్లా, పెండ్లి వెంకటేశ్వర్లు, బొంతా సుధీర్, నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 12న సీనియర్ ఓపెన్,సీనియర్ మహిళల జిల్లా స్థాయి చదరంగం పోటీలు



**బుచ్చి మార్చి 9 ప్రభాతవార్త** కోవూరులోని శ్రీచైతన్య స్కూల్‌నందు ఈనెల 12న సీనియర్ ఓపెన్ ,సీనియర్ మహిళల మహిళలకు జిల్లా స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి పి .మస్తాన్‌బాబు తెలిపారు. ఆయా కేటగిరిలలో మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన చదరంగం క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.పూర్తి వివరాలకు 9848147889 నెంబర్‌కి పోన్ చేయాలని ఆయన కోరారు.

## వృద్దులకు అల్పాహారం పంపీణి



**బుచ్చి మార్చి 9 ప్రభాతవార్త** బుచ్చిరెడిపాళెం మండలంలోని రేబాల గ్రామంలోని నిరుపమ సీనియర్ సిటి జన్ హోమ్ నందు క్రీమ్ సంస్ద ఆద్వర్యంలో గుర్రం దేవిడ్ 25 వ వర్దంతి పురస్కరించుకొని క్రీమ్ సంస్ద నిర్వాహకులు తడిసిన ఇజ్రాయిల్ వృద్దులకు అల్పాహారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ సంస్ద ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.50 మంది వృద్దులకు అల్పాహారం అందజేసినట్లు ఆయన పేర్కున్నారు.ఈకార్యక్రమంలో మేనేజర్ శేషాద్రి,వృద్దులు,వితంతువులు పాల్గొన్నారు.

## 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**బిట్రగుంట, మార్చి 9 ప్రభాతవార్త** బోగోలు మండలంలో ఈ నెల 14వ తేదిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కోవూరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సీమాతబాసు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 1 నుండి 19 సంవత్సరాల లోపు మండలంలో 10 వేల 117 మంది పిల్లలకు ఆల్బెండోజోన్ మాత్రలు మింగించాలని నిర్ణయించారు. 1 నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్రం, 3 నుంచి 19 సంవత్సరాల లోపు వారికి ఒక మాత్ర మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత స్కూలు, అంగన్‌వాడీ, జూనియర్ కాలేజిలలో తప్పనిసరిగా పిల్లల చేత మింగించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీదేవి, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు పరిశీలన



**బిట్రగుంట, మార్చి 9 ప్రభాతవార్త** బోగోలు మండలంలో విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13నఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీదేవి, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆదిలక్ష్మి పరిశీలించి ఏర్పాట్లు, భద్రతపై చర్చించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లకు దిగజారుతున్న వైసిపి నేతలు



**కావలి, మార్చి 9 ప్రభాతవార్త** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో దొంగ ఓట్లు వేయించేందుకు వైసిపి నేతలు దిగజారుతున్నారని, 7,10 తరగతులు చదివిన వారికి డిగ్రీ సర్టిఫికేట్లు ఇచ్చి దొంగ ఓట్లు వేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, కావలి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు వర్ల కుమార్‌రాజాలు తెలిపారు. దొంగ ఓట్లు వేయకుండా ఓటర్లను టిడిపి తీవ్ర స్థాయిలో అడ్డుకుంటుందని వారిని కటకటాలపాలు చేయడానికి వెనుకాడమని హెచ్చరికలు చేశారు. కావలి టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మండలి వద్దు అన్న సియం జగన్మోహన్‌రెడ్డి నేడు మండలి ముద్దు అన్న నినాదంతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పోటీ చేయడం సిగ్గుచేటన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్‌రెడ్డి మండలి విషయంలో ఈ రెండు తప్పారన్నారు. అధికారదర్పంతో రౌడీయిజం,దౌర్జన్యం, బెదిరింపులతో ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలవాలని వైసిపి నేతలు నీచానికి పాల్పడుతున్నారన్నారు. పట్టభద్రుల్ని, ఉపాధ్యాయుల్ని ప్రలోభాలకు లొంగతీసి 10 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్లు ఇస్తున్నామని వైసిపి నేతలు బహిరంగంగా చెబుతున్నారని వారు తెలిపారు. వైసిపి నేతల ప్రలోభాలకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు తలొగ్గరన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందన్న విషయాన్ని,అరాచక పాలనను పట్టభద్రులు, ఉపాధ్యాయులు తెలుసుకున్నారన్నారు. అందుచేత టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్ధి కంచర్ల శ్రీకాంత్, ఉపాధ్యాయుల అభ్యర్ధి లక్కు చినరమణారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్‌రెడ్డికి బుద్దిచెప్పాలని ఓటర్లకు వారు విజ్ఞప్తి చేశారు. దొంగ ఓటర్లలారా ఖబడ్దార్..పట్టుబడితే జీవితం నాశనమౌతుందని హెచ్చరికలు చేశారు. దొంగ ఓటర్లను పోలీసులు అడ్డుకోకపోయినా తమ కంట పడితే ఎత్తుకుపోతామని దొంగ ఓటర్లను హెచ్చరించారు.కాకలు తీరిన ఎంతో మంది పెద్దలు కాలగమనంలో కలిసిపోయారని జగన్‌రెడ్డి చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని దుయ్యబట్టారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు నిఘా వుంటుందని ఎవరైనా దొంగ ఓటు వేస్తే భరతం పడతామని హెచ్చరించారు. ఎటువంటి మచ్చలేని కంచర్ల శ్రీకాంత్‌కు పోటీగా లిక్కర్‌డాన్‌ను వైసిపి నిలబెట్టిందన్న విషయం ఎమ్మెల్సీ ఓటర్లు గమనించాలన్నారు. **కొండబిట్రగుంటలో వైసిపి తిరునాళ్ళు తప్ప అసలైన తిరునాళ్ల ఏది....** పవిత్ర పుణ్యక్షేత్రం మహిమా నిత్వమైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలలో వైసిపి జాతర తప్ప అసలైన తిరునాళ్ల జరగలేదని టిడిపి కావలి నియోజకవర్గ మాలేపాటి సుబ్బానాయుడు దుయ్యబట్టారు. కొండబిట్రగుంట చరిత్రలో ఎప్పుడూ జరగని రథం తగులబడటం, నిన్న రథం వాలిపోవడం కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాలనలోనే జరిగాయన్న విషయం భక్తులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వెంకటేశ్వర స్వామి రథోత్సవ వాహనంపై అధికార అహంకారంతో కొవ్వు పట్టి ఓ వైసిపి నేత కూర్చోవడం దుర్మార్గమన్నారు. ఆలయ అధికారులు, పోలీస్ అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలు చేస్తున్న తప్పిదాలను ప్రసన్న వెంకటేశ్వరస్వామి సైతం జీర్ణించుకోలేకపోతున్నాడని మాలేపాటి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి బెదిరించడం ఎంతవరకు సమంజ సమన్నారు. ఈ బెదిరింపులకు, ప్రలోబాలకు ఉపాధ్యాయులు, పట్టభద్రులు లొంగవద్దని మాలేపాటి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కావలి పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తటవర్తి వాసు, టిడిపి సీనియర్ నాయకులు కావేటి చినకోటయ్య, తదితర నేతలు పాల్గొన్నారు.

## నందవరంలో ఘనంగా గంధమహోత్సవం



**మర్రిపాడు,మార్చి9(ప్రభాతవార్త):** మర్రిపాడు మండలం నందవరంలో శ్రీశ్రీహజరత్ సయ్యద్ మస్తాన్‌వలి వారి 232వ గంధమహోత్స వాని న్ని స్థానికులు గురువారం ఘనంగా నిర్వహజంచారు. ఉదయం గంధాన్ని ఆస్తాన-ఎ-షాబ్దరసూల్ నుండి ఫకీరు మేళతాళాల నడుమ దర్గా వద్దకు చేరకున్నారు. దర్గాలో స్వామివారి సమాధిపై గలేఫ్, పూలుచాదర్, సుగంధ ద్రవ్యాలు స్వామివారికి సమర్పించి దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహజంచారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సయ్యద్ అజిజుల్లాషా, సయ్యద్ ఖైరుల్లాషా, సయ్యద్‌సానితురాబ్ అలీషా తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు



**నెల్లూరు మార్చి 9, ప్రభాతవార్త-వైద్యం** ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ ప్రక్రియను తెలుగుదేశం పార్టీ నేతలు పరిశీలించారు. నగరంలోని వీఆర్ కళాశాలలో ఉన్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌ను నిర్వహిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు, సీల్ విధానానికి సంబంధించిన ప్రక్రియను నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి.మాణిక్యరావు, టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల.శ్రీకాంత్, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి, గంటుపల్లి.నాగేశ్వరరావు, తాళ్ళపాక.అనూరాధ, ఊరందూరు. సురేంద్రబాబు, దొడ్డపనేని.రాజానాయుడు, సాబిర్‌ఖాన్, కనపర్తి.గంగాధర్ తదితరులు పరిశీలించారు.

## వైభవంగా కనకదుర్గా మల్వేశ్వర స్వామి కళ్యాణం





**కోవూరు, మార్చి 9 ప్రభాతవార్త :** కోవూరు మం డలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న కనకదుర్గా దేవి ఆలయంలో గురువారం రాత్రి కనకదుర్గా మల్వేశ్వర స్వామి కళ్యాణంకడుకమనీయంగా కన్నుల పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా రుత్వికులు బ్రహ్మర్షి శ్రీనివాసశర్మ, ఏ.శివకుమార్ శర్మ,రుత్వి కుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణ కార్యక్రమాన్ని కన్నుల పండువగా భక్తులకు వివరించారు. ఈ కళ్యాణ కార్యక్రమానికి చు ట్టు పక్కల ప్రాంతాల నుం చి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కళ్యాణ కార్యక్రమానికి ఉభయ కర్త లుగా కె. అశోక్ జ్ఞాప కార్థం వారి స్నేహితులు,. ఉభయకర్తలుగా బాణాల మధు, మాధవి దంపతులు , వ్యవహరించారు. ఈ కళ్యాణ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా చేపట్టారు.

## కావలిలో విశ్వబ్రాహ్మణులపై జరిగిన రౌడీయిజాన్ని సహించం



**కావలి,మార్చి 9 ప్రభాతవార్త** ఈ స్థలం మాకు అవసరం...మాకే అమ్మాలి లేకపోతే చంపేస్తాం అంటూ నడిరోడ్డుపై స్థలం యజమాని బం ధువులు అన్నవరపు శ్రీని వాసాచారి, వేణు ఆచారిలను కర్రలతో చిత కబాది భయానక వాతావరణాన్ని సృ ష్టించి రౌడీయిజం చేయడం ఎంత వరకు సమం జసమని స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు, వైసిపి నేత నాగాచారి మండిపడ్డారు. విశ్వ బ్రాహ్మణులపై చేసిన రౌడీయిజాన్ని నిరస స్తూ బాధితులకు అండగా స్వర్ణకారుల సంఘంఅధ్యక్షులు, వైసిపి నేత నాగాచారి పోలీసులను ఆశ్రయిం చారు. ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా నాగాచారి మీడియాతో మాట్లాడారు. ఈ దాడిలో అన్నవరపు శ్రీనివాసాచారి తల పగిలి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, కావలి ఏరియా వైద్యశాలలో వేణు ఆచారి గా యాలపాలై చికిత్స పొందు తున్నాడన్నారు. కావలి పట్టణ 26వ వార్డులో కనకాచారి 20 ఏళ్లుగా 12 అంక ణాల స్థలంలో రేకులు నిర్మించుకొని కాపురం వుంటున్నాడని తెలిపారు. మున్సి పల్ పన్ను, కరెంటు బిల్లు అన్ని ఆయన పేరు మీదే వస్తున్నాయన్నారు. ఇల్లు ఉరుస్తుండగా రిపేరు చేసుకునేందుకు కనకాచారి ప్రయత్నం చేస్తున్నాడన్నారు.ఈ ఇంటి పక్కనే వున్న వేలమూరు గోపాల్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ఆయన తమ్ముడు ఈ స్థలం మాకు అమ్మాలని లేకపోతే చంపేస్తామని బెదిరింపులకు దిగార న్నారు. దీంతో స్థలం యజమాని కనకాచారి భయభ్రాంతులకు లోనై బంధువులను ఆశ్రయించాడన్నారు. అన్నవరపు శ్రీనివాసా చారి, వేణు ఆచారిలు మాట్లాడేందుకు వెళ్లార న్నారు. వారిని నడిరోడ్డుపై వేలమూరు గోపాల్‌రెడ్డి, జగదీ ష్‌రెడ్డి, ఆయన తమ్ముడు కర్రలతో చితకబాదుతూ తలకాయలు పగిలేలా కొట్టారన్నారు. వీరి దౌర్జన్య దాడి లో గాయపడ్డ శ్రీనివాసాచారి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడన్నారు. వేణు ఆచారి కావలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. నడిరోడ్డుపై కర్రలతో అత్యంత కిరాతకంగా దాడులు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నా పోలీసులు ఇంకా అరెస్ట్ చేయకపోవడం బాధాకరమన్నారు. బాధితులకు అం డగా విశ్వబ్రాహ్మణ సంఘం వుందన్నారు. కిరాతకంగా దాడులు చేసిన ఈ రెడ్లను అరెస్ట్ చేసే దాకా ఊరు కునేది లేదని ఎంతదూరమైనా వెళ్తామని స్వర్ణకారుల సంఘం అధ్య క్షులు, వైసిపి నేత నాగాచారి తీవ్ర స్థాయి లో హెచ్చరికలు చేశారు. గురువారం కావలి టు టౌన్ ఇన్‌చార్జ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావును వన్‌టౌ న్‌లో కలిసి నాగాచారి మాట్లాడారు. సంఘటన బుధవారం జరిగి 24 గంటలు కావస్తున్నా రౌడీయిజం చేసిన వారిని ఇంకా అరెస్ట్ చేయకపోతే ఎలా అని నాగాచారి ప్రశ్నించారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## అన్నం పెట్టిన ఇంటికి కన్నం వేసిన వైనం

**నెల్లూరు క్రైమ్,మార్చి9, ప్రభాతవార్త** నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో గత ఏడు సంవత్సరాలు నుండి పెరివేటి లక్ష్మీ(42)అనేమహిళ తన భర్త కలిసి అద్దెకు ఉంటున్నారు.ఈ క్రమంలో మంగళవారం రాత్రి అదను కోసం వేచి చూసిన తరుణంలో తన ఇంటి యజమాని ఆమె అత్తగారిని ఇంటిలో వదిలిపెరమేటి లక్ష్మితో జాగ్రత్తగా చూసుకోమని చెప్పి తమ సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లారు.ఈ క్రమంలో పెరివేటి లక్ష్మీ ఆ వృద్ధురాలిని చంపుతామని బెదిరించి ఆమె ఒంటిపై ఉన్న 98గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించారు.వృద్ధురాలు కోడలు గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా ఈ రోజు ఉదయం ముద్దాయిని అరెస్టు చేసిఆమె వద్ద ఉన్నటువంటి 98గ్రాముల బంగారు అభరణాలను స్వాదీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా నవాబుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటిచర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.ఈ చోరీ కేసును ఛేదించేందుక ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రత్యేక వసతులతో సన్‌షైన్ తల్లిపిల్లల హాస్పటల్



**బుచ్చి మార్చి 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని సన్‌షైన్ తల్లిపిల్లల వైద్యశాలలో ప్రత్యేకంగా గైనిక్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చిన్నపిల్లల స్పెషలిస్టు డాక్టర్ సుబ్బారెడ్డి,డాక్టర్ స్రవంతిరెడ్డి తెలి పారు. గురువారు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసిన అనంతరం డాక్టర్ స్రవంతిరెడ్డి గైనికాలజిస్టు విలేఖర్లతో మాట్లాడుతు మహానగరాలకు దీటుగా సన్‌షైన్ తల్లిపిల్లల వైద్యశాల బుచ్చిరెడ్డిపాళెంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. సాధరణ కాన్పులు చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయనున్నట్లు ఆమె తెలి పారు. సాధరణ కాన్పులు 12 వేలకు,సిజరిన్ 25 వేల రూపాయాలకే చేయనున్నట్లు చెప్పారు.ప్రతి మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కేవలం కాన్పులు,గైనిక్‌కి సంబంధించినవే కాకుండా సాధారణ జ్వరాలు, సాధారణ వ్యాధులు కూడా పరిక్షించనున్నట్లు ఆమె తెలిపారు.ఈకార్యక్రమంలో చిన్నపిల్లల స్పెషలిస్టులు డాక్టర్ రాజు,డాక్టర్ తిరుమలేష్,డాక్టర్ సుబ్రమణ్యం,సాలా క్రిన్‌పురం నాయకులు జైరామిరెడ్డి,నరసింహారెడ్డి ,వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ అమ్మవారి ఆలయానికి ఏర్పాట్లు



**ఉదయగిరి మార్చి 9 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో ప్రాజక్టు పరిశం ప్రాంతంలో గండిపాళెం యాదవ్‌లు గంగమ్మ అమ్మవారి దేవాలయాం ప్రతిష్టాపన చేయుటకు భూమిని పరిశీ లించారు. అనంతరం 112 కుటుంబాలు కలిగిన యాదవ్‌లు తమ వంతు విరాళాలు అందించేందుకుసన్నద్దం అయ్యారు.ఈ దేవాలయం నిర్మాణానికి జిఎంకే ట్రస్టు అధినేత గంటుపల్లి మాలకొండయ్య చౌదరి 4 లక్షల రూపాయాలు విరాళం ప్రకటించారు. అనంతరం బొందుకాళ్ళ గంగయ్య కుటుంబ సభ్యులు 2 లక్షలు,మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య లక్షరూపాయాలు,విరాళం అందించారు.ఈకార్యక్రమంలో గండిపాళెం యాదవ్‌సభ్యులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ



**వింజమూరు,మార్చి9(ప్రభాతవార్త):** వింజమూరు పంచాయతీ పరిధిలోని నేరేడుపల్లి గ్రామంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద వ్యవసాయ రైతులకు అవసరమైన పనిముట్లను ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల 8న ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా రైతుల కోరిక మేరకు నిరంతరం అవసరమైన పనిముట్లను అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా పనిముట్లు అవసరమైన రైతులు నమోదు చేసుకున్నవారికి వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నా మన్నారు . నేరేడుపల్లిలో రెండు పవర్‌స్ప్రేయర్లను అందించామన్నారు. గ్రామంలోని రైతులందరు ఈ పవర్ స్ప్రేయర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు కాకర్లను అభినందించారు. ఈకార్యక్రమంలో కొమ్మి శ్రీనివాసులునాయుడు, ఏగినేని నాగేశ్వరరావ్, కండె రమణయ్య, బొరిగర్ల శ్రీనివాసులు, కొమ్మి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీఅంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



**వింజమూరు,మార్చి9(ప్రభాతవార్త):** పిలిచిన వెంటనే పలికే తల్లి గ్రామదేవత శ్రీఅంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో యాగాలు నిర్వహించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అంకాలమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని 5రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరిరోజు అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించి అర్చకులు సుబ్రహ్మణ్యాచారిచే ప్రాణప్రతిష్ట చేయించారు.ముందుగా జ్ఞానాదివాసం, జలాదివాసం, క్షీరాదివాసం జరిపించి గురువారం ప్రతిష్ట చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారు తొలి పూజలు అందుకొని భక్తులను తమ చల్లని చూపులతో ప్రసన్నవదనంతో కటాక్షించారు. భక్తులు



కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారు సు మారు కొన్ని దశాబ్దాల క్రితం ఎక్కడినుంచో నడుచుకుంటూ వస్తున్న ఆమెను అనుసరిస్తూ గ్రామస్తులు అడు గులు వేశారు. ఆమె ఎదురుగా వస్తున్న గాజులమ్మేవారిని చూసి తన చేతులకు గాజులు వేయించుకుంది. గాజులమ్మేవాడు డబ్బులు అడగ్గా మా అన్నగారు నా వెనుకాల వస్తున్నారు వారిని అడిగి తీసుకోమని చెప్పి అమ్మవారు ముందుకు సాగిందని, గాజులశెట్టి అమ్మగారి అన్నదగ్గర డబ్బులు తీసుకొని వెళ్ళిపోయారు. ఆమె అలా నడుచుకుంటూ ప్రస్తుతం ఆలయం నిర్మించి ఉన్నచోట విశ్రాంతి కోసం నిలవడంతో ఆనాడు గ్రామంలోని కొ ందరు గుండెమడకల పొలిమేర ఈ ప్రాంతమవుతుందని తెలపడంతో ఆనాడు ఏరుకొల్లు గ్రామస్తులు వివాదానికి దిగడంతో ఆ వివాదం కాస్త పెద్దల సమక్షంలో ఆ ప్రాంతం గుండెమడకల పొలిమేరగా నిర్ధారించారు. ఇక్కడే అమ్మవారు స్థిరంగా నిలిచిపోయారని పెద్దలు చెబుతున్నారు. ఇప్పుడున్న ఆలయం ప్రక్కనే నూతనంగా ఆలయాన్ని నిర్మించి అమ్మవారిని ప్రతిష్టించారని అర్చకులు తెలిపారు. అమ్మవారు శక్తిస్వరూపిణిగా నిలిచి పలికే దైవంగా, కల్పవల్లిగా భక్తులను కటాక్షిస్తూ గ్రామానికి చెడు ప్రభావాలు తగలకుండా తల్లి కాపాడుతుందని ప్రగాఢంగా గ్రామస్తులు విశ్వసిస్తున్నారు. ఈకార్యక్రమంలో పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**నెల్లూరు మార్చి 9, ప్రభాతవార్త-వైద్యం** షుగరు, బీపీ ఒబేసిటీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా పెయిన్ కిల్లర్ మాత్రలు వాడేవారు, కిడ్నీ వ్యాధి పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ ఆసుపత్రి యూరాలజిస్ట్ డాక్టర్లు హెచ్చరించారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రిలో కిడ్నీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధి విస్తరిస్తున్న తీరు డాక్టర్లు ఆందోళనను వ్యక్తంచేశారు. 48 ఏళ్ళ వయస్సు దాటిన తరువాత ప్రతి ఒక్కరు కిడ్నీ సంబంధిత క్రియేటిన్, యూరిన్, అల్ట్రాసౌండ్ పరీక్షలతోపాటు సీరం టెస్ట్ కూడా చేయించుకోవాలని సూచించారు. ప్రపంచం మొత్తం మీద కోవిడ్ వచ్చిన సమయంలో, యుద్ధాల వలన. భూకంపాల వలన ఎన్నో రకాల కొత్త వ్యాధులు పుట్టుకొస్తుండడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఊపిరితిత్తులు, కిడ్నీల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య విధానంలో వస్తున్న మార్పుల వల్ల ప్రతి వ్యాధిని ముందుగానే గుర్తించవచ్చున్నారు. అందుకు సంబంధించిన పరీక్షలు అన్ని మెడికవర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మెడికవర్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు వేలు అయ్యే కిడ్నీ చెకప్‌ను రూ.699కే అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, నెఫ్రాలజీ విభాగం డాక్టర్ మాధవదేశాయ్, డాక్టర్ సురేంద్రకుమార్, యూరాలజీ విభాగం డాక్టర్ యువరాజు, డాక్టర్ గోకుల్, పీఆర్ఓ చందువర్మ, ఆసుపత్రి సిబ్బంది, కిడ్నీ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డికి ధన్యవాదాలు తెలిపిన నారాయణబాబు

**హరినాధపురం,మార్చి9,ప్రభాతవార్త**



నెల్లూరు జిల్లా వైయస్సార్‌సిపి సాంస్కృతిక శాఖ విభాగ అధ్యక్షులుగా నియమితులైన వైసీపి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.తనపై నమ్మకంతో గతంలో కళారంగానికి తాను చేసిన సేవలనుగుర్తించి సాంస్కృతిక శాఖ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు ఎంపీ వేడిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాడుతాతీయగా భాస్కర్, డ్యాన్స్ మా స్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు,సెక్రటరీ కొండదపాణి, చిట్టిబాబు,కంచి జనార్దన్ ,కరి ముల్లా,రమణయ్య,విజయ్,వెంకి ఇతర కళాకారులు పాల్గొన్నారు.

## సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు మెప్మా పొదుపు మహిళలు విరాళం



**నెల్లూరు అర్బన్,మార్చి9,ప్రభాతవార్త** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు,క ందుకూరు,కావలి,ఆత్మకూరుమున్సి పాలిటీలో పొదుపు మ హిళలు సైనిక వెల్ఫేర్ ఫండ్ 6,57,910రూ భారీ మొత్తాన్ని సేకరించి గురువారం సాయం త్రం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు అందజే శారు.మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డి.రవీంద్ర ఆధ్వ ర్యంలో ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో జిల్లాలో సమస్థ ఈ మొత్తాన్ని సేకరించడం జరిగింది.విరాళాలను సమాఖ్యల ద్వారా సేకరించి చెక్కులు,బ్యాంక్‌పే ఇన్‌స్లిప్‌ల ద్వారా 6,57,910రూ లను జిల్లా కలెక్టర్ ద్వారా పి.ఎస్ రమేష్ సైనిక్‌వెల్ఫేర్ ఆఫీసర్,నెల్లూరు మెప్మాపధక సంచాలకులు అందజేశారు.ఈ విరాళాలు అందజేసిన పొదుపు మహిళలను,సేకరించడంలో ప్రత్యేక శ్రద్దచూపిన పట్టణ 8సమాఖ్యలు,ఆత్మకూరు పట్టణ సమాఖ్య,కావలి పట్టణ,కందుకూరు పట్టణ సమాఖ్యలను జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు,పట్టణ మహిళలు,సైనిక వెల్ఫేర్ ఫండ్‌కి విరాళాలు అందజేయుటలో ముందు న్నారని అదేవిధంగా అన్ని కార్యక్ర మాల్లో మెప్మా ముందంజలో ఉండాలని వారి సేవా తత్పరణను, ఉదార వైఖరిని కొనియాడారు.ఈ కార్యక్ర మంలో పాల్గొన్న సమాఖ్య పధాధికారులు,కార్యాలయ సిబ్బందిని పట్టణ పేదరిక నిరూ ్మలన సంస్థ పధక సంచాలకులు రవీంద్ర అభినందించారు.



నెల్లూరులోని తల్పగిరి శ్రీ రంగనాథస్వామి రథోత్సవం గురువారం వేడుకగా నిర్వహించారు. మాజీమంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవం ముందు భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఫోటోలు: నందా మాల్యాద్రి

